
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
ఆదివారం 16 నవంబరు 2025



సాంకేతికతతో వాతావరణ మార్పుల గుర్తింపు
- టెక్సాస్ అగ్రోహైడ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు
- కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల సందర్శన 7

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం
- మహిళలు చదువుకుంటేనే సమాజ అభివృద్ధి
- మైనారిటీ గురుకులాల కార్యదర్శి షఫీయుల్లా 7



హుస్నాబాద్‌లోని తమ్మల బాజా కళాకారులు

తమ్మలి బాజా కళాకారులు
స్వరబ్రహ్మలు

ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్న హుస్నాబాద్‌లోని దేవునూరి కుటుంబం

200 ఏళ్ల సంప్రదాయ వాయిద్యం వారి సొంతం

ఆలయాల్లో సుప్రభాత వేళ మధుర రాగం

శుభకార్యాల్లో శ్రేష్ఠంగా భావించే సంగీతం

బ్రాస్ బ్యాండ్‌లతో ఈ కళకు తగ్గుతున్న ఆదరణ

ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యమివ్వాలని వేడుకోలు

7 లో

పరిమితికి మించి కంకర రవాణా చేస్తున్న టిప్పర్లపై రవాణాశాఖ అధికారులు కొరఢా ఝులిపిస్తున్నారు. ఇటీవల చేవెళ్ల వద్ద ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో 19 మంది చనిపోయిన విషయం విదితమే. ఈ ప్రమాదానికి డ్రైవర్ అజాగ్రత్తతోపాటు టిప్పర్‌లో కంకర ఓవర్‌లోడ్ ఉన్నందునే తీవ్రత పెరిగిందని ప్రాథమికంగా గుర్తించారు. ఈ నేపథ్యంలో అధికారులు టిప్పర్లను టార్గెట్ చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు.

చేవెళ్ల ప్రమాదం తర్వాత ప్రత్యేక దృష్టి

పరిమితికి మించి అక్రమంగా కంకర తరలింపు

తెరవెనుక రాజకీయ నేతల పాత్ర

టిప్పర్లే టార్గెట్

కొరడా ఝులిపిస్తున్న రవాణా అధికారులు..62 టిప్పర్లపై ఓవర్‌లోడ్ కేసులు

సంగారెడ్డి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో గత పది రోజులుగా రవాణా శాఖ అధికారులు టిప్పర్ల వేటలో పడ్డారు. రహదారులపై వెళ్తున్న టిప్పర్లను గుర్తించి ఓవర్‌లోడ్‌ను పరీక్షిస్తున్నారు. పరిమితికి మించి కంకర, ఇసుక ఉంటే వెంటనే సీజ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 రోజుల వ్యవధిలోనే 62 టిప్పర్లపై కేసులు నమోదు చేశారు.

స్పెషల్ స్క్వాడ్ ఫోకస్

ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వెంకటరమణ నేతృత్వంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేకంగా స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. తాజాగా జహీరాబాద్‌లో చెక్‌పోస్టు ఎత్తివేసిన తర్వాత అక్కడ పనిచేస్తున్న ఆరుగురు ఎంవిఐలనూ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంకు మార్చారు. వీరు నిత్యం టిప్పర్లతోపాటు

మిగతా 7వ పేజీలో

10 రోజుల్లో నమోదైన కేసుల వివరాలు

జిల్లా	వాహనాల సీజ్	జరిమానా
సంగారెడ్డి	42	రూ.8,50,815
సిద్దిపేట	17	రూ.3,81,995
మెదక్	03	రూ.45,975

కఠిన చర్యలు తప్పవు



ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలను ఉపేక్షించేది లేదు. చేవెళ్ల ఘటన తర్వాత రవాణా శాఖ మంత్రి, సెక్రటరీ, కమిషనర్‌ల నుంచి మాకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. అందుకే స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి నిఘా పెంచాము. ఓవర్‌లోడ్ వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాహనాల గురించి (9948788445) నంబరుకు సమాచారాన్ని వాట్సాప్ చేయగలరు. తగిన వివరాలు అందిస్తే కేసులు నమోదు చేస్తాం. కంకర, ఇసుక, ఇతర సరుకులను రవాణా చేస్తే వాహనాలపై టార్పాలిన్లు తప్పనిసరిగా ఉండాలి. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు.

-వెంకటరమణ, డీటీసీ, ఉమ్మడి మెదక్ జిల్లా



సీజ్ చేసిన కంకర టిప్పర్లు



తూప్రాన్‌లో పొలంలో నీరు నిలవడంతో నేలవాటిన వరి

నీళ్లు తగ్గేదెప్పుడు?
కోత కోసేదెప్పుడు?

తూప్రాన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో మెదక్ జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికే భారీ వర్షాలకు పంట దిగుబడి తగ్గిపోగా.. కోతలు కోసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పొలాల్లో నీరు నిలిచింది. ఇప్పటికే వరి నేల వాలగా.. పది రోజులైనా పొలం ఆరకపోవడంతో కంకులు మొలకలు వస్తున్నాయి. పొలాల్లో నీరు తగ్గకపోవడంతో హార్వెస్టర్లకు డిమాండ్ పెరిగింది. సాధారణంగా గంటకు రూ. 2,600 వసూలు చేసే హార్వెస్టర్ యజమానులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని రెట్టింపు వసూలు చేస్తున్నారు. పండిన పంట ఖర్చులకే సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు.



నారాయణఖేడ్ నుంచి వలసల వెళ్తున్న గిరిజనులు

'ఖేడ్'లో మళ్లీ ప్రారంభమైన
గిరిజనుల వలసలు

నారాయణఖేడ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెరకు క్రషింగ్ సీజన్ ప్రారంభం కావడంతో నారాయణఖేడ్ ప్రాంతం నుంచి కూలీల వలసలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో అటు సాగునీటి వనరులు లేవు.. ఇటు పరిశ్రమలూ లేకపోవడంతో వానాకాలం పంటల సాగు పూర్తవగానే పనులేమీ ఉండవు. దీంతో, వర్షాధార పంటలపైనే ఆధారపడిన గిరిజనులు సీజన్ పూర్తికాగానే చెరకు నరకడానికి, చక్కెర కర్మాగారాల్లో పనిచేయడానికి వలసలు వెళ్తున్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు వెళ్తుండటంతో తండాలన్నీ ఖాళీ అవుతున్నాయి.

గజగజ..

కోహీర్‌లో 8.1 డిగ్రీలు

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు



కోహీర్‌లో..

కోహీర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంలో శనివారం ఉదయం 8.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లా రామాయంపేటలో 9.6 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 8.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత ఐదేళ్లుగా శీతాకాలంలో కోహీర్ మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయికి పడిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి.

సంగారెడ్డి జిల్లాలో..

కోహీర్ 8.1, ఝరాసంగం 8.8, న్యాల్‌కల్ 9.0, సదాశివపేట 9.0, అల్గోల్ 9.2, నల్లవల్లి 9.4, కంగ్టి 9.5, నిజాంపేట్ 10.0, దిగ్వాల్ 10.1, సత్వార్ 10.2, రాయికోడ్ 10.5, కద్లూల్ 10.6, నాగల్‌గిద్ద 10.7, జిన్నారం 10.7, మల్‌చెల్మ 10.9, మొగుడంపల్లి 10.9, పుల్కల్ 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో..

రామాయంపేట 9.6, దొంగల ధర్మారం 9.6, నార్లాపూర్ 9.7, శివనూర్ 9.9, వడ్డీ 10.1, సర్దన 10.1, కాగజ్ మద్దూర్ 10.1, లక్ష్మాపూర్ 10.2 నాగపూర్ 10.4. బుజ్జారంపేట్ 10.5, శంకరంపేట(ఏ) 10.5, కుల్చారం 10.5, పాతూర్ 10.9, దామరంచ 10.9, బోడగట్ 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లాలో..

పోతిరెడ్డిపేట్ 8.9, హబ్సిపూర్ 9.6, అంగడికిష్టాపూర్ 9.8, కొండపాక 9.9, తుక్కాపూర్ 10.4, రాంపూర్ 10.6, మీరుదొడ్డి 10.7, వెంకటరావుపేట్ 10.8, బేగంపేట్ 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



పాపన్నపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రైతుల ఖాతాల్లోకి
రూ.102.84 కోట్లు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటివరకు రూ. 102.84 కోట్లు రైతులకు చెల్లించినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రమైన పాపన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 27,252 మంది రైతుల నుంచి 1,14,077 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, డబ్బులు చెల్లించామని చెప్పారు. కొనుగోలు చేసిన వడ్లను వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం మండలంలోని ఎల్లాపూర్ గ్రామంలో పశువైద్యశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ మూగ జీవాలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఆదేశించారు.

వెనుకబాటులోనే మెదక్ జిల్లా

- అభివృద్ధి అసంపూర్ణం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హవేళీఘణపూర్ మండలంలో రైతులతో మాట్లాడుతున్న కవిత

మెదక్/హవేళీఘణపూర్/చిన్నశంకరంపేట/చేగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెతుకు సీమ వెనుకబాటుతనానికి కారణం గత పాలకులు అవలంబించిన విధానాలేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి, శనివారం ఆమె మెదక్ జిల్లాలో జనంబాట నిర్వహించారు. నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని పోలంపల్లిలో కేవల్ కిషన్ సమాధి వద్ద నివాళులర్పించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. హవేళీఘణపూర్ మండలంలోని దూప్‌సింగ్ తండా, కూచన్‌పల్లి గ్రామంలో పాడి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మెదక్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలతో పోలిస్తే మెదక్ జిల్లా చాలా వెనుకబడిందని వాపోయారు. నర్సాపూర్‌లో షాపుల్లో హాస్టల్ నెలకొల్పారని, దుకాణాలు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి చెందినవని పేర్కొన్నారు. రెడ్డిపల్లి రైతులు ఎకరాకు రూ. కోటి విలువైన భూములు ట్రిపుల్ ఆర్ రహదారి నిర్మాణంలో కోల్పోతున్నారని, వారికి మార్కెట్ రేటు ప్రకారం కోటి రూపాయల నష్టపరిహారం, లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరారు. మెదక్ అంటే హరీశ్‌రావు అంటుంటారని, మరి జిల్లాలోని ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపు పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. మెదక్ కేంద్రంగా జిల్లా ఏర్పాటయినప్పటికీ అభివృద్ధి కుంటుపడిందని వాపోయారు. రైతుబజార్, మినీ ట్యాంక్‌బండ్ మధ్యలోనే నిలిచిపోయాయని, మెదక్‌లో చిల్డ్రన్స్‌పార్క్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్‌లో యూనివర్సిటీ ఏర్పాటు చేయకపోగా ఉన్న పీజీ సెంటర్‌ను కూడా ఎత్తివేశారని మండిపడ్డారు. మెదక్‌ను చార్మినార్ జోన్ కిందకు చేర్చాలని డిమాండ్ చేశారు. కేవలం 50 సీట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని, అక్కడా సౌకర్యాలు లేవని ఆరోపించారు. ఈ కాలేజీకి రావాల్సిన మరో 50 సీట్లను సీఎం రేవంత్ కొడంగల్ మెడికల్ కళాశాలకు తరలించారని మండిపడ్డారు. మెదక్‌లో నర్సింగ్ కళాశాలకు రూ.20 కోట్లు మంజూరు చేశారు కానీ భూమి ఇంకా కేటాయించకపోవడంతో నిధులు నిలిచిపోయాయని వాపోయాయి. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరించకపోవడంతో ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా మార్చినప్పటికీ ఇప్పటికీ మెదక్‌లోనే ఆర్డీవో కార్యాలయం కొనసాగుతోందని వివరించారు. రూ.200 కోట్లతో శంకుస్థాపన చేసిన యంగ్ ఇండియా స్కూల్ పనులు పూర్తిచేయాలని సూచించారు. జిల్లా కేంద్రం చుట్టూ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెదక్‌కు సరైన సమయంలో రైళ్లు నడపాలని ఆమె కోరారు. అనంతరం జాగృతి జిల్లా నాయకుడు రమేష్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



చేగుంట మండలం పొలంపల్లిలో చలి కాచుకుంటున్న కవిత



లోక్‌అదాలత్‌లో సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర



మెదక్‌లో మాట్లాడుతున్నసీనియర్ సివిల్ జడ్జి రుబీనా ఫాతిమా

లోక్‌అదాలత్‌తో సత్వరన్యాయం

సంగారెడ్డి, మెదక్ జిల్లాల న్యాయాధికారులు

లోక్‌అదాలత్ సక్సెస్

సంగారెడ్డి జిల్లాలో 2,508, మెదక్ జిల్లాలో 521 కేసుల పరిష్కారం

సంగారెడ్డి క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని సంగారెడిట జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ అదాలత్ ద్వారా కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతుందని అన్నారు.మోటార్ వాహన ప్రమాద కేసుల్లో కక్షిదారులకు నష్టపరిహారం అందుతుందని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట కోర్టుల్లో శనివారం ప్రత్యేక జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా మొత్తం 2,508 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి కె.జయంతి, మూడో అదనపు న్యాయాధికారి జి.సునీతా రవీంద్రారెడ్డి, న్యాయాధికారులు లావణ్య, తేజోకార్తిక్, అనిత, ధనలక్ష్మి, దుర్గారాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య పాల్గొన్నారు.

సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దు

మెదక్ అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న గొడవలతో కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని డబ్బును వృథా చేసుకోవద్దని మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నీలిమ పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్, అల్లాదుర్గంలో స్పెషల్ లోక్ అదాలత్‌లో 521 వివిధ రకాల కేసులు పరిష్కరించబడ్డాయన్నారు.

విఠలేశ్వర ఆలయాభివృద్ధికి కృషి..

మంత్రి దామోదర్ రాజనర్సింహ



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి దమోదర్

మునిపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అంతారం పాండురంగా విఠలేశ్వర ఆలయాభివృద్ధికి కృషిచేస్తానని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. జీవన్ముక్త పాండురంగ విఠలేశ్వర ఆలయ వార్షికోత్సవం, జాతర ఉత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేసిన అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, మాజీ ఎంపీటీసీ పాండు తదితరులు ఉన్నారు.

రెండు నెలలుగా జీతాల్లేక అవస్థలు

● జీపీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

పుల్‌కల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా జీతల్లేక అవస్థలు పడుతున్నామని జీపీవోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సత్యనారాయణ, రాజు, గౌరవాధ్యక్షుడు సంతోష్‌కుమార్ దేశ్‌పాండే, సలహాదారులు బైండ్ల రమేశ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో చేరి రెండు నెలలు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని విచారం వ్యక్తం చేశారు. జిల్లాలో 270 మంది జీపీవోలకు అన్నీ రకాల పరీక్షలు రాయించి, అర్హత సాధించిన అనంతరం ప్రభుత్వం నియామకాలు చేపట్టిందని గుర్తు చేశారు. జీపీవోలు పక్క మండలం కాకుండా ఇతర నియోజకవర్గాల్లో విధులు నిర్వహించడం వల్ల రోజూ 50 నుంచి 90 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. రానుపోను చార్జీలు తడిసిమోపేడవుతున్నాయని, ఓ వైపు ఆరోగ్య సమస్యలు, మరో వైపు ఈఎంఐ చెల్లింపులు, కుటుంబ పోషణ భారంగా మారి అవస్థలు పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో అతి పెద్ద పండుగ. బతుకమ్మ, ఇతర పండుగలు కూడా పోయానని, అయినప్పటికీ జీపీవోలకు జీతాలు విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్నీ రకాల జీవోలు సర్క్యులర్లను జారీ చేసి రెండు నెలలు గడిచిందన్నారు. ఇప్పటికైనా జీపీవోల వేతనాలు చెల్లించాలని వారు కోరుతున్నారు.

అరగంట శ్రమించి.. డ్రైవర్‌ను బయటకు తీసి

● నీటి ట్యాంకర్ లారీని ఢీ కొట్టిన మరో లారీ
● లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్.. తీవ్ర గాయాలు



చెట్టుకు ఢీ కొట్టుకున్న లారీ, గాయపడిన ప్రవీణ్

కొండపాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నీటి ట్యాంకర్ లారీని మరో లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ లారీలో ఇరుక్కుపోయాడు. దీంతో అరగంట పాటు శ్రమించి అతికష్టం మీద డ్రైవర్‌ను బయటకు తీసి చికిత్సకు తరలించారు. ఈ సంఘటన కొండపాక శివారులో గౌరాయపల్లి స్టేజి వద్ద రాజీవ్ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే కొండపాకలోని రాజీవ్ రహదారిపై చెట్లకు నీరు పోస్తున్న నీటి ట్యాంకర్ లారీని హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు కోళ్ల ఫీడ్ లోడుతో వెళ్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టింది. అనంతరం రోడ్డు కిందకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో లారీ డ్రైవర్ ప్రవీణ్ అందులోనే ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ అక్కడికి చేరుకొని దాదాపు అరగంటసేపు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీశారు. వెంటనే ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి


ఘటన స్థలంలో నాగరాజు మృతదేహం

కుకునూరుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లి గ్రామానికి చెందిన న్యాలపోగుల నాగరాజు(30) మండల కేంద్రంలో బార్బర్ షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం నాగరాజు బైక్‌పై మండల కేంద్రంలోని కమాన్ వద్ద యూటర్న్ చేసుకొని బస్టాండ్ వైపు వస్తున్న క్రమంలో సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి నాగరాజు నడుపుతున్న బైకును వెనక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజు గత ఐదు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. నాగరాజు మరణంతో కుటుంబం రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. మృతుడికి భార్య, కూతురు దీప్తి కన్న(5), కుమారుడు ధృవం(3) ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన నాగరాజు మృతితో భార్యాపిల్లల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లారీ ఢీకొని మహిళ...


లక్ష్మి(ఫైల్)

మాసాయిపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మాసాయిపేట లోని 44వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలి వివరాల ప్రకారం తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన పార్టీ లక్ష్మి(32) శనివారం తన భర్త చందుతో కలిసి రామంతాపూర్‌లో చదువుతున్న తమ కుమారుడి పాఠశాల ఫీజు కట్టడానికి వెళ్లారు. తిరిగి తమ కుమారుడితో సహా బైక్‌పై వస్తుండగా మాసాయిపేట కంకర మిషన్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరిని ఢీకొనడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త చందు, కుమారుడు తరుణ్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం వారిని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

బాలుడిని చితకబాదిన పినతండ్రిపై కేసు

రామాయంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలుడిని పిన తండ్రి చితకబాదిన ఘటనపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. మానవీయ కోణంలో స్పందించిన రామాయంపేట పోలీసులు నిందితుడిపై చర్యలకు ఉపక్రమించారు. మెదక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వద్దకు వెళ్లి విచారణ జరిపారు. అనంతరం ఏఎస్ఐ కృష్ణ ఫిర్యాదు ఆధారంగా 118 క్లాస్ (1), జువెనైల్ అండ్ 75 ఆఫ్ జస్టిస్ యాక్ట్ ప్రకారం నిందితుడు రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటకు చెందిన సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజ్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో అవు దూడ మృతి


మృతి చెందిన అవు దూడ

దౌల్తాబాద్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో ఓ అవు దూడ మృతి చెందిన సంఘటన దొమ్మాట అడవి గాజులపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం దొమ్మాట ఫారెస్ట్ లోని గాజులపల్లి గ్రామానికి చెందిన రైతు బోయిని శివయ్య రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద పశువులను కట్టెశాడు. శనివారం పొద్దున ఆయన పొలం వద్దకు వెళ్లి చూడగా అవు దూడ తీవ్ర గాయాలతో మృత్యువాతపడి కనిపించింది. గుర్తు తెలియని జంతువు అవుదూడపై దాడి చేసినట్లు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. దుబ్బాక రెంజ్ అధికారి సందీప్‌కుమార్, సెక్షన్ అధికారి మల్లేశం సంఘటన స్థలానికి చెరుకొని అవు దూడను పరిశీలించారు. ఏదో అడవి జంతువు దాడి చేసి ఆవుదూడ పొట్ట భాగాన్ని పూర్తిగా తినేసిందాన్ని అధికారులు పేర్కొన్నారు. పంచనామా నిర్వహించి తగిన నష్ట పరిహారాన్ని అందిస్తామని తెలిపారు. దూడ మృతితో రూ.50 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నుంచి ఆర్థిసాయం అందించిఆదుకోవాలని బాధిత రైతు అధికారులను కోరారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

● వయోజన విద్య జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న వయోజన విద్య జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి

హత్నూర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రతి మహిళను అక్షరాస్యురాలిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని వయోజన విద్య జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. హత్నూర మండల సమైక్య సమావేశ మందిరంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటికీ గ్రామాలలో నిరక్షరాస్యులు ఉన్నారని అన్నారు. వారందరికీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన వడ్లను కొనుగోలు చేయాలి

హత్నూర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ సిరిపుర గ్రామస్థులు శనివారం కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు న్యాయవాది భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తాము ఆరుగాలం కష్ట పడి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడువగా, ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగులు కేంద్రాలలో కొనడం లేదని తెలిపారు. దీంతో దిక్కు తోచని స్థితిలో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన దాన్యం కొనుగోలు చేసి న్యాయం చేయాలని కోరారు.

వాతావరణ మార్పులకు సాంకేతిక అభివృద్ధి అవసరం

● టెక్సాస్ అగ్రోహైడ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు
● కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల సందర్శన



కందిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీనివాసులును సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కంది, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌లో వాతావరణ మార్పులకు ప్రతిస్పందించగల సాంకేతిక పరిష్కారాల అవసరం ఎంతైన ఉందని టెక్సాస్ (యూఎస్‌ఏ), వెర్నన్‌కు చెందిన అగ్రోహైడ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. వాతావరణ మార్పులు పంటలపై చూపుతున్న ప్రభావాలపై అవగాహన విద్యార్థులతో పరస్పర చర్చలు జరిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వర్షపాతం అస్థిరత, పంట ఉత్పాదకత తగ్గుదల వంటి అంశాలను శాస్త్రీయ ఆధారాలతో వివరించారు. అనంతరం ఆయనను వ్యవసాయ ఇంజనీరింగ్ అధ్యాపక బృందం శాలువాలతో సన్మానించింది. కార్యక్రమంలో వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ స్వామి, విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థికి బంగారు పతకం



ఆశ్రిత రాజు దాట్ల

పటాన్‌చెరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారతీయ పికిల్ బాల్ జాతీయ పోటీ-2025లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థిని ఆశ్రిత రాజు దాట్ల బంగారు పతకాన్ని సాధించారు. ఈ నెల 13 నుంచి 16 వరకు బెంగళూరులో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో 18 ఏళ్లలోపు బాలికల విభాగంలో రాష్ట్ర జట్టు తరఫున ఆశ్రిత పాల్గొని అద్భుత ప్రతిభ కనబర్చింది. ఆశ్రితకు డైరెక్టర్ ప్రవృత్ బి.హెచ్, చీఫ్ రిఫరీ కునాన్ పోఖామా సంతకాలతో కూడిన ప్రశంసా పత్రంతో పాటు బంగారు పతకాన్ని ఇచ్చి సత్కరించారు. ఆశ్రితను గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, క్రీడల విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎం.నారాయణరావు చౌదరి తదితరులు ప్రశంసించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

● మైనారిటీ గురుకులాల కార్యదర్శి షఫీయుల్లా



సమావేశంలో మాట్లాడుతున్న షఫీయుల్లా

గజ్వేల్, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని తెలంగాణ మైనారిటీ గురుకులాల కార్యదర్శి షఫీయుల్లా అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని గుండన్నపల్లిలోని బాలికల గురుకులాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు చదువుకుంటేనే కుటుంబం, సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని, ఎన్ని కష్టాలు వచ్చినా విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. మొదటగా 2016లో రాష్ట్రవ్యాప్తంగా 205 మైనారిటీ గురుకులాలు, అనంతరం జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రతి విద్యార్థిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.లక్షా 20వేలను ఖర్చు చేస్తుందన్నారు. పాఠశాల హాస్టల్, తరగతి గదులు, వసతులు పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఐవో నాగలక్ష్మి, రీజనల్ కోఆర్డినేటర్, హజ్ కమిటీ సభ్యులు జాఫర్ ఖాన్, నాయకులు సమీర్, తదితరులు ఉన్నారు.

భూమి హద్దులు చూపండి సారూ

● 20 ఏళ్లుగా చేసిన విజ్ఞప్తుల ప్రతుల బుక్‌లెట్‌తో బాధితుడి వినతి



విజ్ఞప్తుల బుక్‌తో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బాధితుడు

నారాయణఖేడ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా తనకు పట్టా ఇచ్చిన భూమి హద్దులు చూపించడం లేదని సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన బాధితుడు షేక్ మహబూబ్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి పలుమార్లు అధికారులకు ఇచ్చిన విజ్ఞప్తుల ప్రతుల బుక్‌లెట్‌ను నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం అందజేశారు. సబ్ కలెక్టర్‌ను కలిసేందుకు సిబ్బంది అనుమతించక పోవడంతో ఇన్‌వార్డులో తన విజ్ఞాపన బుక్‌ను అందజేశారు. తహసీల్దార్, ఆర్డీవో మొదలుకొని కలెక్టర్, మంత్రులు, సెక్రటరియేట్ వరకు 20 ఏళ్లుగా సమస్యపై విజ్ఞాప్తులు చేస్తూనే ఉన్నానని తెలిపారు. సిర్గాపూర్‌లో 64 సర్వే నంబరులో తన భార్య ఫకీర్ అమీనాబి పేర రెండుకరాల పట్టా ఇచ్చారన్నారు. పట్టాదారు పాసు పుస్తకం ఉన్నా భూమి హద్దులు చూపడం లేదని పేదవాడినైన న్యాయం చేయాలని ఆయన కోరారు.

లింక్‌పై క్లిక్ చేసిన యువకుడు..
ఖాతాలోని డబ్బు మాయం

తూప్రాన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గ్రూపులో వచ్చిన యోనో యాప్ లింక్ ఓపెన్ చేయగా బ్యాంకు ఖాతాలోని రూ. 27,100 మాయమైంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలానికి చెందిన వ్యక్తి వాట్సాప్ గ్రూపులో యోనో యాప్ లింక్ రాగా.. ఈ నెల 12న దానిపై క్లిక్ చేసి ఫోన్‌లో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి, వివరాలు నమోదు చేసి లాగిన్ అయ్యాడు. అనంతరం తన ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 27,108 నుంచి మొదట రూ, 26వేలు, తరువాత రూ.1,100 డెబిట్ అయినట్లుగా మెస్సేజ్ వచ్చింది. దీంతో ఫోన్ హాక్ అయినట్లు గుర్తించిన అతడు 1930కి కాల్ చేసి విషయం తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తమ్మలి బాజా కళాకారులు

సండే స్పెషల్ Sunday Special

స్వరబ్రహ్మలు



ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్న హుస్నాబాద్‌లోని దేవునూరి కుటుంబం
200 ఏళ్ల సంప్రదాయ వాయిద్యం వారి సొంతం
ఆలయాల్లో సుప్రభాత వేళ మధుర రాగం
శుభకార్యాల్లో శ్రేష్ఠంగా భావించే సంగీతం
బ్రాస్ బ్యాండ్‌లతో ఈ కళకు తగ్గుతున్న ఆదరణ
ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యమివ్వాలని వేడుకోలు

ఆలయాల్లో సుప్రభాత వేళ మధుర రాగం, శుభకార్యాల్లో శ్రేష్ఠమైన బాజాభజంత్రీల మేళం, ప్రముఖులకు స్వాగతం పలికే సంగీత వాణి ఇవన్నీ తమ్మలి బాజా వాయిద్యానికి ఉన్న సంప్రదాయ గుర్తింపులు. దేవుడి కల్యాణోత్సవం, బ్రహ్మోత్సవం, రథోత్సవం, శంకుస్థాపన, ప్రారంభోత్సవం వంటి ఎలాంటి కార్యక్రమమైనా, నాదస్వరం (సన్నాయి) సహా ఈ స్వరబ్రహ్మల సంగీత నాదం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దాదాపు 200 ఏళ్లుగా వేడుకల్లో మమేకమైన ఈ సంప్రదాయానికి ఇంతటి ఆదరణ ఉన్నప్పటికీ, దీన్ని నమ్ముకున్న తమ్మలి బాజా కళాకారుల పరిస్థితి మాత్రం దీనంగా ఉంది. అయినా పురాతన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్న హుస్నాబాద్ పట్టణంలోని తమ్మలి బాజా కళాకారుల జీవనంపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

- హుస్నాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి)



హుస్నాబాద్‌లోని తమ్మల బాజా కళాకారులు

తమ్మలి బాజా సంస్కృతి 200 ఏళ్లకు పైగా ఉందని హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ రోడ్డులో ఉంటున్న కళాకారుల కుటుంబ పెద్ద దేవునూరి చంద్రమౌళి తమ అనుభవాలను పంచుకున్నారు. తమ్మలి బాజా కళాకారులు హుస్నాబాద్‌తో పాటు సిద్దిపేట, కోహెడ, శనిగరం, సిరిసిల్ల, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, మంథని, స్టేషన్ జనగామ, కరీంనగర్, యాదగిరిగుట్ట, చెన్నూరు, జగిత్యాల వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉన్న ప్రాంతాల్లో ఉన్నారు. ముఖ్యంగా ఆలయాల్లో దేవుని సేవలో ఈ వాయిద్యాలను వాయిస్తారు. సంప్రదాయబద్ధంగా పెళ్లిళ్లు చేసుకునేవారు నాదస్వరం బృందాన్ని వినియోగించుకుంటారు. హుస్నాబాద్‌కు చెందిన దేవునూరి చంద్రమౌళి తాతల కాలం నుంచి ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆయన కుమారులు దేవునూరి హరీశ్, దేవునూరి అశోక్‌లు కూడా ఇదే వృత్తిని కొనసాగిస్తున్నారు.

తమ్మలి కుల వాయిద్యాలు

తమ్మలి బాజాలో తప్పనిసరిగా ఉండే వాయిద్యాలు రెండు డోళ్లు, ఒక మద్దెల, శృతి, తాళం. ఈ నాలుగు రకాలతో ఘనసట్ సమ్మేళనం ఉంటుంది. సన్నాయి-మృదంగ సమ్మేళనంలో ఐదుగురితో కలిసి మేళం ఉంటుంది. 26 నుంచి 38 అంగుళాల పొడవైన నల్లని కర్రతో తయారు చేసిన సన్నాయిలో రంధ్రాలు, నాదబి, శృతి కోసం మరో నాలుగు రంధ్రాలు ఉంటాయి. వాటి చివర గిన్నె ఆకారంలో అన్సులు ఏర్పాటు చేస్తారు. మరోవైపు త్రిభుజ ఆకారంలో తయారుచేసిన ఆకు పేకలతో సన్నాయి ఏర్పడుతుంది. వాటి నుంచి వస్తున్న రాగాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తాయి. అలాగే, సమ్మేళనం వాయించేందుకు చేతి వేళ్లకు మట్టిలు పెట్టుకుని వాయిస్తారు. దాదాపు 200 సంవత్సరాల క్రితమే సంగీత స్వరాలు పుట్టుకొచ్చాయంటారు. రాజుల కాలం నుంచి వస్తున్న ఈ నాదస్వర సంగీత బృందం ఇప్పటికీ ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తోంది.

బ్రాస్ బ్యాండ్‌ల దెబ్బ..

గతం కంటే ప్రస్తుతం పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని, దేవాలయాల్లో వాయిద్య కళాకారులుగా అవకాశం ఇస్తున్నారని కళాకారులు పేర్కొంటున్నారు. అయితే, ఈ సంగీత పరిజ్ఞానం లేని కొంతమంది ఇతర కులస్థులు సన్నాయి మేళం వాయిస్తామంటూ వచ్చి, సంప్రదాయానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు పెళ్లిళ్లలో తమ్మలి బాజా తప్పనిసరిగా ఉండేది. ఇవి వివాహాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. కానీ, ఈ మధ్యకాలంలో బ్రాస్‌బ్యాండ్‌లు, డీజే సౌండ్‌లు, ఇతర వాయిద్యాలు రావడంతో నాదస్వరంతో జీవనాడీలను ఉప్పొంగించే స్వరబ్రహ్మలైన తమ్మలి బాజా కళాకారులకు అవకాశాలు తగ్గిపోయాయి. ఇప్పుడిప్పుడే ఈ వాయిద్యాలకు మళ్లీ ఆదరణ వస్తోంది. ముఖ్యంగా దేవాలయాలు వీరి సేవలను వినియోగించుకుంటున్నాయి.

ప్రభుత్వ సంక్షేమం అందట్లేదు!

హుస్నాబాద్ పట్టణంలోని సిద్దేశ్వర గుట్ట వద్ద ఉన్న దేవునూరి చంద్రమౌళి కుటుంబం తాతల కాలం నుంచి తమ్మలి బాజా వృత్తిని కొనసాగిస్తోంది. ఇతని కుమారులైన దేవునూరి హరీశ్, దేవునూరి అశోక్‌లు మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర ఆలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈ వృత్తి చేస్తున్నారు. అలాగే, సిద్దేశ్వర నాదస్వరం ఏర్పాటు చేసి ఈ వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్నారు. అయితే, వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదు. చంద్రమౌళి కుమారులు హరీశ్, అశోక్‌లు మృదంగంలో డిప్లొమా చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు, బ్యాంకు రుణాలు కావాలి



మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. తాతలు, తండ్రుల కాలం నుంచి ఇదే వృత్తి మీద ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. వృత్తి ఉన్నప్పుడు ఈ పని చేసుకుంటున్నాం, లేనప్పుడు వేరే పనులు చేస్తున్నాం. ప్రభుత్వం మాకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతున్నాం. వాయిద్యాలకు లక్ష రూపాయల వరకు అవుతున్నాయి. వీటికి బ్యాంకు రుణాల ద్వారా ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటున్నాం.

- దేవునూరి చంద్రమౌళి

వారసత్వాన్ని కొనసాగిస్తున్నాం



ముత్తాతల నుంచి వస్తున్న ఈ సంస్కృతిని కొనసాగిస్తున్నాం. పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర ఆలయంలో ఈ తమ్మల బాజా వాయిస్తున్నాం. వృద్ధ కళాకారులకు పింఛన్ ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అదే కాకుండా, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తమకు ప్రాధాన్యత కల్పించాలి.

-దేవునూరి హరీశ్

మృదంగంలో డిప్లొమా చేశాను



నేను మృదంగంలో డిప్లొమా చేశాను. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. ఈ వృత్తిపై ప్రేమతో మా తండ్రిగారితో శుభకార్యాలకు వెళ్తుంటాను. పొట్లపల్లి దేవాలయంలో పనిచేస్తున్నాను. ఈ సంగీతం పట్ల ఎలాంటి అవగాహన లేని కొంతమంది వివాహాది శుభకార్యాలకు సన్నాయి, నాదస్వరం వాయిస్తామంటూ చెడ్డపేరు తీసుకొస్తున్నారు. ఈ కళను నేర్చుకోవడానికి చాలా కష్టం, శిక్షణ అవసరం.

- దేవునూరి అశోక్

భరత్‌నగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

● తనిఖీల్లో ఎయిర్‌గన్ లభ్యం



జహీరాబాద్ : ఎయిర్‌గన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



జహీరాబాద్ : పోలీసులుస్వాధీనం చేసుకున్న ఆటోలు

జహీరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని భరత్‌నగర్‌లో శనివారం డీఎస్పీ సైదా ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జహీరాబాద్, సంగారెడ్డి డివిజన్ పోలీసుల పెద్ద ఎత్తున తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలులేని 33 ద్విచక్రవాహనాలు, 14 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఎయిర్ గన్‌తో పాటు దుప్పికొమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలో ఎస్ఐలు వినయ్ కుమార్, కాశీనాథ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పటాన్‌చెరు : రామేశ్వరంబండలో పోలీసుల తనిఖీలు

205 మంది అనుమానితుల గుర్తింపు

పటాన్‌చెరు నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రేశం పురపాలక పరిధి రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో శనివారం ఉదయం సమయంలో 220 మంది పోలీసులతో కలిసి నాలుగు బృందాలుగా విడిపోయి తనిఖీలు జరిపారు. పాపిలాన్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా 205 మంది అనుమానితులను గుర్తించారు. అందులో నలుగురు పాత నేరస్థులు ఉన్నారు. సరైన పత్రాలు లేని 62 మోటారుసైకిళ్లు, 17 ఆటోలు, ఒక కారును పట్టుకున్నారు. 15 వాహనాలకు జరిమానాలు విధించారు. 17 వాహనాలకు పెండింగ్ జరిమానాలు క్లియర్ చేయించారు. భద్రత విషయంలో రాజీలేకుండా వ్యవహరిస్తున్నామని డీఎస్పీ ప్రభాకర్ చెప్పారు.

టిప్పర్లే టార్గెట్

(5వ పేజీ తరువాయి)

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలు, బస్సులపై ఫోకస్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే 10 రోజుల వ్యవధిలోనే 62 ఓవర్‌లోడ్ వాహనాలను సీజ్ చేశారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో ఒక స్క్వాడ్ చొప్పున, సంగారెడ్డి జిల్లాలో రెండు స్క్వాడ్‌లు నిమగ్నమయ్యాయి.

కంకరలోనూ నేతల పాత్ర

సంగారెడ్డి జిల్లా లకుడారం, బ్యాతోల్, జిన్నారం మండలంలోని పలు గ్రామాల్లో కంకర క్వారీలు భారీగా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వీటిని నిర్వహిస్తున్నారు. క్వారీల సంగతి పక్కనబెడితే కంకరను ఇతర ప్రాంతాలకు తరలించడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. పరిమితికి మించి 5 నుంచి 10 టన్నుల కంకరను అదనంగా అక్రమ రవాణా చేస్తున్నారు. దీని వెనుక పలువురు రాజకీయ నేతల అండదండలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. అందుకే అధికారులు సైతం చర్యలకు వెనుకాడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. సిద్దిపేట జిల్లాలోనూ కంకర క్వారీలపై నిఘా కరువైంది. ఇటీవల చేవెళ్ల ప్రమాదానికి కారణమైన కంకర టిప్పర్ సైతం సంగారెడ్డి జిల్లాలోని క్వారీ నుంచే యల్దేరడం గమనార్హం.

నిషేధిత ఆల్ప్రాజోలం పట్టివేత

● ఒకరు అరెస్ట్, పరారీలో మరొకరు

సిద్దిపేట క్రైం నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ఆల్ప్రాజోలం రవాణా చేస్తుండగా ఎక్సైజ్ అధికారులు ఒకరిని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 420 గ్రాముల ఆల్ప్రాజోలాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో కల్లులో కలిపే 420 గ్రాముల నిషేధిత ఆల్ప్రాజోలాన్ని ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనంపై చిన్న నిజాంపేటకు తీసుకెళ్తున్న పాతూరి ఎల్లాగౌడ్‌ను భూంపల్లి మండలం అక్బర్‌పేట చౌరస్తా వద్ద పట్టుకున్నారు. నిందితుడి నుంచి సరుకును స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందన్నారు. ఇతనికి ఆల్ప్రాజోలం సరఫరా చేసిన బండి నగేశ్‌గౌడ్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ కె. శ్రీధర్, సిద్దిపేట ఎస్‌హెచ్‌ఓ ఏ. శ్రీనివాస్, ఎస్ఐ కిరణ్, హెడ్ కానిస్టేబుళ్లు చెన్నగౌడ్, రవీందర్, కానిస్టేబుళ్లు స్వామిరెడ్డి, దశమంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రేఖ రవి, రమేష్ ఉన్నారు.

వివాదాస్పద భూమిపై హైకోర్టుకు..

కంది, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది మండలంలో తొలిసారిగా ఓ ప్రభుత్వ భూమి విషయంలో రెవిన్యూ అధికారులు హైకోర్టు మెట్లు ఎక్కనున్నారు. మండలంలోని కాశీపూర్ సర్వే నంబర్ 114లో దాదాపు 49.27 ఎకరాల పరంపోగు భూమి ఉండగా, గతంలో పలువురికి ప్రభుత్వం అసైన్ చేసింది. ఈ స్థలం పక్కనే భూమిని కొనుగోలు చేసిన ఓ ప్రైవేట్ సంస్థ సర్వేనంబర్ 114లోని 10.37 ఎకరాల భూమిని దక్కించుకునేందుకు ప్రయత్నించింది. తహసీల్దార్ రవికుమార్ మండలంలోని ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించిన క్రమంలో ఇది ప్రభుత్వ భూమిగా తేలిన విషయాన్ని ఆంధ్రజ్యోతి ఇటీవలే వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో సర్వే నంబర్ 114లో దాదాపు 49.27 ఎకరాల భూమి పరంపోగు భూమి ప్రైవేటుపరం ఎలా అయ్యిందని చర్చ జరుగుతోంది. గత రెవెన్యూ అధికారులు ప్రైవేటు సంస్థల మామూళ్లకు లొంగిపోయి వారికి సహరించినట్లు రైతులు బాహటంగానే విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడడమే లక్ష్యం



మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించి అన్యాక్రాంతమైన వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికార యంత్రాగం సిద్ధమైంది. ఇటీవల చేర్యాల శివారులో దాదాపు రూ. 30 కోట్ల విలువ చేసే 6 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకున్నాం. కాశీపూర్ భూమి విషయంలో హైకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేస్తున్నాం. ప్రభుత్వ భూమి ప్రైవేటుపరం ఎలా అయ్యిందో విచారణ జరుపుతున్నాం.

- రవికుమార్, తహసీల్దార్

రైతులు ఖాతాల్లోకి ట్రిపుల్ ఆర్ పరిహారం



తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

తూప్రాన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రీజనల్ రింగ్ రోడ్ (ట్రిపుల్ ఆర్) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి భూసేకరణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం వరకు 178 మంది రైతుల ఖాతాల్లో రూ. 13 కోట్లు జమా చేసినట్లు తెలిపారు. గుండ్రెడ్డిపల్లి గ్రామంలో 76 మంది, వెంకటాయపల్లిలో 88 మంది, వట్టూరులో 11 మంది, దాతర్‌పల్లిలో ఇద్దరు, కిష్టాపూర్‌లో ఒకరి ఖాతాల్లో డబ్బులు జమా చేసినట్లు పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో అందరి ఖాతాల్లో డబ్బులు జమా చేయనున్నట్లు వివరించారు. 2022 నాటి రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ ధరల ప్రకారం 2013 నాటి భూసేకరణ చట్టం ప్రకారం నిర్ణయించిన నష్ట పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. 1956 నాటి కేంద్ర రహదారుల చట్టం ప్రకారం భూ యజమానులు ధర నిర్ణయంపై ఆర్బిట్రేషన్ కోసం కలెక్టర్‌కు దరఖాస్తులు అందించారన్నారు. వీటిని త్వరలో విచారించి కలెక్టర్ పెంచే నష్ట పరిహారం రెండో విడతగా రైతుల ఖాతాల్లో జమా చేస్తామని తెలిపారు.

అటవీ జాతుల చైతన్యానికి ప్రేరణ బిర్సా ముండా

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అటవీ జాతుల చైతన్యానికి బిర్సా ముండా చేసిన పోరాటం ప్రేరణాత్మక చిహ్నమని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని ఆకలింపుచేసుకుని బ్రిటీష్ పాలనలో జరిగిన దోపిడీని బిర్సా ముండా అర్థం చేసుకున్నారన్నారు. నేటి బీహార్, జార్ఖండ్ ప్రాంతాల్లో అప్పట్లో జరిగిన మిలినీరియన్ ఉద్యమానికి ఆయన సారథ్యం వహించి బ్రిటీషర్లపై యుద్ధాన్ని ప్రకటించి అటవీ జాతుల హక్కుల కోసం ఉద్యమించిన మహానుభావుడని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజారాణి, ట్రైనీ కలెక్టర్లు దీపిక, ప్రతిభ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో భగవాన్ బిర్సా ముండా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

వృద్ధులు భావితరాలకు మార్గదర్శకులు

వయో వృద్ధులు భావితరాలకు మార్గదర్శకులని, వారిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సంగారెడ్డిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శనివారం వయోవృద్ధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులపై కుటుంబ సభ్యుల నిర్లక్ష్యం పెరిగిపోవడంతో ఒంటరివారిగా కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధుల సంరక్షణలో ఎక్కడైనా సమస్యలు ఉంటే మహిళా శిశు సంక్షేమ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, డీఈవో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో వసంతరావు, డా. నాగనిర్మల, డా. శశాంక్, యువజన, స్పోర్ట్స్ వెల్ఫేర్ అధికారి ఖాసీం బేగ్, డీఆర్‌డీవో (పెన్షన్ విభాగం) షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి సేవ చేసేందుకే స్కౌట్స్, గైడ్స్

మునిపల్లి, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజానికి సేవ చేసేందుకు స్కౌట్స్, గౌడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని లింగంపల్లి గురుకుల సొసైటీ పాఠశాలలో భారత స్కౌట్స్ , గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బేసిక్ కోర్స్ కార్యక్రమానికి శనివారం అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల సొసైటీ పాఠశాలను ఎంపిక చేయడం గర్వకారణమన్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 52పాఠశాలలు ఎంపిక కాగా ఇందులో 97మంది విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం రూ. 12లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలోకి రాగానే గురుకుల విద్యార్థులు బ్యాండ్ మేళాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని డీఈవో వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు, డ్యాన్స్‌లు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర కమిషనర్ మోహన్ రావు, లీడర్ ట్రైనింగ్ గైడ్ భరతమాత, ఉపాధ్యాయులు, పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.

ఆదివాసీ సమాజానికి ఆయనే మార్గదర్శి

మెదక్ అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సమాజానికి భగవాన్ బిర్సా ముండా మార్గదర్శి అని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లో బిర్సా ముండా 150 జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ పూల మాలలు వేసి, జ్యోతిని వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత దేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం పోరాడిన మహానాయకుడు బిర్సా ముండా త్యాగాలను, ఆదర్శాలను గుర్తు చేశారు. ఆయన జీవితమే ఆదివాసీ హక్కుల సాధనకు, స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, గిరిజన సంక్షేమాధికారి నీలిమ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్

సంక్షిప్తం



మంత్రి దామోదర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీఎంహెచ్‌వో డా.వసంతరావు

మంత్రిని కలిసిన నూతన డీఎంహెచ్‌వో

సంగారెడ్డి అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నూతన డీఎంహెచ్‌వోగా నియమితులైన డా.ఎం.వసంతరావు శనివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అప్రమత్తంగా ఉంటూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయనకు సూచించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు.

భరోసా పనితీరు భేష్



భవానీచంద్రకు మొక్కను అందజేస్తున్న భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి

సంగారెడ్డి క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భరోసా పనితీరు భేషుగ్గా ఉందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర కితాబిచ్చారు. సంగారెడ్డిలోని జిల్లా భరోసా కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. భరోసాకు వచ్చిన బాధితులతో భవానీ చంద్ర మాట్లాడారు. న్యాయపరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, పట్టణ సీఐ రాము నాయుడు, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ తరగతులు

సంగారెడ్డి రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 16న తరగతులు నిర్వహించనున్నట్లు తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డి. రమేష్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మొదటి, మూడవ సెమిస్టర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నేడు బీసీ న్యాయసాధన దీక్ష

సంగారెడ్డి రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 16న బీసీ న్యాయ సాధన దీక్షను నిర్వహిస్తున్నట్లు బీసీ జేఏసీ చైర్మన్ ప్రభుగౌడ్ తెలిపారు. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఈ దీక్ష చేపట్టామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడమే దీక్ష ఉద్దేశ్యమన్నారు. ఇట్టి దీక్షలో జిల్లాలోని అన్ని నియోజకవర్గానికి చెందిన బీసీలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సంగారెడ్డిలో పద్మశాలీల వనభోజనాలు

సంగారెడ్డి రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీల అధ్వర్యంలో శనివారం సంగారెడ్డిలోని నిర్వహించిన వన భోజనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్ హాజరయ్యారు. పద్మశాలీ సంఘం నాయకులు చింతా సాయినాథ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రామచంద్రారావు, చంద్రశేఖర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు పండరి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిహర కిషన్, అశోక్, పట్టణ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన అధికారులు

జిన్నారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం మున్సిపాలిటీ సోలక్‌పల్లి, హిమామ్‌నగర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ నివాసాలను తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లు ప్రారంభించారు. శనివారం రెండు గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ నివాసాలను తహసీల్దార్ దేవదాస్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ, నాయకులు ఉన్నారు.

కార్మికుల అక్రమ బదిలీలపై ఆందోళన

జిన్నారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో కార్మికుల అక్రమ బదిలీలు, సస్పెండ్‌లను వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. శనివారం కాజీపల్లి పరిధిలోని శ్రీరామ పరిశ్రమ వద్ద సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. యూనియన్ ఏర్పాటు చేశారని కార్మికులపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, ఫకీం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



అందమైన అలంకరణలన్నీ ఒకేచోట కుమ్మరిస్తే కనిపించే దృశ్యం ఇలాగే ఉంటుంది కాబోలు.. చూసేందుకు వింతగా కనిపిస్తున్నా ఇది ద్విచక్ర వాహనమే సుమా..! వందల సంఖ్యలో రంగు, రంగుల అలంకరణలు, కృత్రిమ పూలదండలు, తోరణాలు మోస్తూ చూపరులను ఆకట్టుకున్నది. ఓ చిన్న మోపెడ్‌పై ఇన్ని రకాల వస్తువులు ఇలా తీసుకెళ్తుండటంతో జనం వింతగా చూశారు. శనివారం రామాయంపేట పాత హైవేపై కనిపించిన ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

- రామాయంపేట,నవంబర్ 15(ఆంధ్రజ్యోతి)

ఉప్పరిగూడెంలో సామూహిక సీమంతాలు

పుల్‌కల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని ఉప్పరిగూడెంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. గ్రామంలోని గర్భిణులను గుర్తించి వారికి స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీమంతాల కార్యక్రమంలో చిరుధాన్యాలు, కొత్త వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మౌనిక, ఏఎన్‌ఎం అనసూయ, ఆశా వర్కర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

మహిళా శక్తిని బయటకు తేవడానికే సప్తశక్తి సంఘం



ఖేడ్‌లోని శిశుమందిర్‌లో సప్త శక్తి సంఘం కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

నారాయణఖేడ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తిని బయటకు తీసుకురావడం కోసమే సరస్వతీ శిశుమందిరాల ద్వారా సప్త శక్తి సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్‌ఎస్‌ఎస్ మహిళా విభాగ్ బాధ్యురాలు అనుసూజరెడ్డి అన్నారు. శనివారం ఖేడ్‌లోని సరస్వతీ శిశుమందిర్‌లో సప్తశక్తి సంఘంను ప్రారంభించిన సందర్భంగా ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సుష్మ, దారం అనుసూజలతో కలిసి పాల్గొని మాట్లాడుతూ సప్త శక్తులంటే కీర్తి, ధనం, వాక్కు, శృతి, మేథ, ధృతి, క్షమ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్త్రీ శక్తిని చైతన్యవంతం చేయడం కోసం ఈ కార్యక్రమాలను చేపట్టామన్నారు. స్త్రీ భార్యగా, తల్లిగా, కూతురుగా, అనేక విధాలుగా వ్యవహరిస్తుందన్నారు. ఆడపిల్లలు రాణించేలా ప్రతీ తల్లి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో 150 మంది మాతృమూర్తులు పాల్గొన్నారు.

నేడు రామాయంపేటలో..

రామాయంపేట, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రజ్ఞా నారీమణి భారతీయం సత్యవాణి ఆదివారం మెదక్ జిల్లా రామయంపేకు విచ్చేయనున్నట్టు అశోక్ సింగాల్ శిశు మందిర్ ప్రిన్సిపాల్ కవిత శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో తెలిపారు. తెలంగాణ ప్రాంత సరస్వతి విద్యాపీఠం అధ్యక్షురాలు అనఘా వెంకటలక్ష్మితో కలిసి స్థానిక శిశు మందిర్‌లో సప్త శక్తి సంఘం కార్యక్రమంలో పాల్గొననున్నట్టు తెలిపారు.

గ్యాస్ సిలిండర్‌పై ఇష్టారీతిగా అధిక వసూళ్లు

మనోహరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు వంటగ్యాస్ సిలిండర్ సబ్సిడీపై అందించడం తెలిసిందే. అయితే మనోహరాబాద్ మండల కేంద్రంలో హెచ్‌పీ, భారత్, ఇండియన్ గ్యాస్ మొత్తం కలసి మండల కేంద్రంలో 15 వేలకు పైగా గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. కాగా ఒక్కో గ్యాస్ ఏజెన్సీ వారు తమ ఇష్టారీతిగా తమ వినియోగదారుల నుంచి అదనంగా డబ్బు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. మనోహరాబాద్ మండల కేంద్రానికి చేగుంట ఏజెన్సీ నుంచి భారత్ గ్యాస్ మండలంలో సుమారు4000 వరకు వినియోగదారులు ఉన్నారు. హెచ్‌పీ గ్యాస్ మండలంలోని కాళ్లకల్ గ్రామంలో, అలాగే ఇండియాన్ గ్యాస్ ఆఫీస్ తూప్రాన్‌లో ఉంది. భారత్ గ్యాస్ ప్రభుత్వం నుంచి ఏజెన్సీలకు సుమారు రూ.922కు లభిస్తుందని ఏజెన్సీ వారు తెలిపారు. చేగుంట నుంచి మనోహరాబాద్ మండలం వరకు 38 కిలో మీటర్ల దూరం వస్తుంది. గ్యాస్ సప్లై దారులు మండలంలోని ఏ గ్రామం అయినా వినియోగదారులకు సుమారు రూ. 970కు సిలిండర్‌ను అందజేస్తున్నారు. అంటే ట్రాన్స్‌పోర్ట్ పేరిట ఒక్కో సిలిండర్‌పైన సుమారు రూ.48 అధికంగా తీసుకుంటున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూప్రాన్‌లో ఆఫీసు ఉన్న ఇండేన్ గ్యాస్ వారు మనోహరాబాద్ మండలకేంద్రంలో ఒక్కో సిలిండర్‌కు రూ.960 వసూలు చేస్తున్నారు. ఇలా ఒక్కో గ్యాస్ ఏజెన్సీవారు దూరాన్ని బట్టి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. కొన్ని గ్రామాలలో తెలిసిన కిరణా షాపులలో 7 నుంచి 8 సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసుకుంటూ ఇష్టారీతిన డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో సిలిండర్‌ను బుక్ చేసుకుంటే డెలివరీ చేసిన తర్వాత బిల్లు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు జిల్లా యంత్రాంగం గ్యాస్ సప్లై దారులు అధిక రేటు వసూలు చేయకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.



ఖేడ్‌లో లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్ ధ్రువ పత్రాన్ని అందజేస్తున్న ట్రాన్స్‌కో ఏడీఈ నాగిరెడ్డి

గిరిజనుల గృహాల్లో విద్యుదీకరణ: ఏడీఈ

నారాయణఖేడ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): డీఏడీజేజీయూఏ ఆధ్వర్యంలో విద్యుత్ సదుపాయం లేని గిరిజనుల గృహాల్లో విద్యుదీకరణ చేశామని ఖేడ్ ట్రాన్స్‌కో ఏడీఈ నాగిరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్, నాగల్‌గిద్ద, నిజాంపేట మండలాల్లో విద్యుత్ సదుపాయం లేని 48 గిరిజనుల గృహాలకు రూ.15,01,526 వెచ్చించి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, తీగలు, మీటర్లను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా శనివారం శ్రీ భగవాన్ ముర్సాముండా 150వ జయంతి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లబ్ధిదారులతో పాటు గిరిజనులతో ఖేడ్ ట్రాన్స్ కో కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సదుపాయాలు లేని గిరిజనుల గృహాల్లో విద్యుద్దీకరణ, విద్యుత్ రంగంలో ప్రభుత్వాల చొరవ, విద్యుత్ భద్రత, శక్తి పరిరక్షణపై అవగాహన కల్పించామన్నారు. ఆసక్తి గల లబ్ధిదారులు తమ జీవిత భాగస్వామితో కలిసి 2026లో న్యూఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వీక్షించడానికి ప్రత్యేక అతిథులుగా పాల్గొన వచ్చన్నారు.

పరిశ్రమలకు నిరంతర విద్యుత్

● ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ అట్లూరి కామేష్

పటాన్‌చెరు నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడానికి అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఉపకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ అట్లూరి కామేష్ అన్నారు. ఈ మేరకు శనివారం పటాన్‌చెరు, సంగారెడ్డి డివిజన్‌లలో పర్యటించి వినియోగదారుల సమస్యలు తెలుసుకున్నారు. పటాన్‌చెరు, పాశమైలారం, ఐడీఏబొల్లారం, బొంతపల్లి పారిశ్రామికవాడల అవసరాలు తీరుస్తూ అదే సమయంలో గృహాల వినియోగదారుల అవసరాలను తీరుస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాల్లో నిరంతరాయ విద్యుత్‌ను అందించేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

సమస్యల గుర్తింపుకు బస్తీదర్శన్



మల్లికార్జున్‌నగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో పర్యటించడం వల్ల సమస్యలు గుర్తించగలుగుతున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ పేర్కొన్నారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మల్లికార్జున్‌నగర్ కాలనీలో బస్తీదర్శన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగు సమస్యలు ఎక్కువగా ఉన్నాయంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సీసీ రోడ్లు ధ్వంసమై వాహనాలు నడపలేని పరిస్థితుల్లో ఉన్నాయని విన్నవించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మురుగు సమస్యలు పరిష్కరించడానికి నిధులు విడుదల అవుతున్నాయని, అన్ని రకాల సమస్యలు పరిష్కారం జరిగేట్టు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు రఘురామ్‌రెడ్డి, విఠల్, బాల్‌రెడ్డి, బలరాం, అరుణ్‌సింగ్, శాంతారాం, కాశీనాథ్, కిష్టయ్య, బాగయ్య, బసవరాజు, వెంకటేశ్వర్లు, నర్సింహగౌడ్, శేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు తాగునీటి కష్టాలు



పాడైన బోరు వద్ద వాటర్ బాటిళ్లతో విద్యార్థులు

కోహీర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మండలంలోని పీచేర్యాగడి ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 57 మంది విద్యార్థులకు తాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. దాదాపు రెండు నెలలుగా తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపడం లేదు. పాఠశాల ఆవరణంలో ఉన్న బోరు చెడిపోయి రెండు నెలలు గడుస్తున్న పాడైన బోరును బాగు చేసేందుకు అధికారులు కృషి చేయడం లేదు. దీంతో విద్యార్థులు ఇంటి వద్ద నుంచి వాటర్ బాటిళ్లలో నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పాడైన బోరును బాగు చేయించాలని కోరుతున్నారు.

క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి



పోలీసు పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న మెదక్‌జిల్లా అదనపు ఎస్పీ

మెదక్ అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీసు విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి అని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు మైదానంలో నిర్వహించిన పరేడ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ... ఫిట్‌నెస్, క్రమశిక్షణ, స్పిరిట్ పెంపొందించడంలో పరేడ్ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, రంగా నాయక్ పాల్గొన్నారు. జిల్లా పోలీసు వ్యవస్థలో హోంగార్డులు కీలకపాత్ర పోషిస్తూ.. ప్రజల రక్షణలో ఎల్లప్పుడూ ముందుంటారని అదనపు ఎస్పీ మహేందర్ గుర్తు చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సిబ్బందికి అవసరమైన సహాయం, మార్గదర్శకత, సంక్షేమ కార్యక్రమాలు అందించడం పోలీసు ప్రధాన బాధ్యత అన్నారు.

వీక్లీ పరేడ్‌ను పరిశీలించిన డీఎస్పీ

తూప్రాన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో నిర్వహించిన వీక్లీ పరేడ్‌ను తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పరిశీలించారు. తూప్రాన్ సర్కిల్ పరిధి తూప్రాన్, వెల్దుర్తి, శివ్వంపేట, మనోహరాబాద్ పోలీసుస్టేషన్‌లకు చెందిన సిబ్బంది పరేడ్ నిర్వహించారు. తూప్రాన్ సీఐ రంగకృష్ణతో కలిసి పరేడ్ నిర్వహణను డీఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సిబ్బందికి పలు సూచలు, సలహాలు అందజేశారు.

మెదక్ మున్సిపాలిటీకి రూ.30.29 కోట్లు మంజూరు

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కింద మెదక్ మున్సిపాలిటీకి రూ. 30.29 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం జీవో విడుదల చేశారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరవడం పట్ల స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నిధులు మంజూరైనా.. పనుల నివేదిక సరిగ్గా లేని కారణంగా తిరిగి ప్రజల అవసరాలను గుర్తించి అంచనాలు వేయించామన్నారు. వెంటనే టెండర్లు నిర్వహించి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందజేయనున్నట్లు వివరించారు.

దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు

పుల్‌కల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న పంచాయతీ రాజ్ రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 58 పనులకు రూ.కోటీ 28.34 లక్షలు మంజూరు చేయగా, ఇందులో అందోలు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 14 పనులకు రూ.35.3 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టర్ పి.ప్రావీణ్య పరిపాలన ఉత్తర్వులు జారీ చేశారు. అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని అందోలు, వట్‌పల్లి, రాయికోడ్, పుల్కల్, చౌటకూర్, మునిపల్లి మండలాల్లో పంచాయతీ రాజ్ రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే, వాటి తక్షణ మరమతుల కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ నిధుల కింద రూ.35.3 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 14 పంచాయతీ రాజ్ రహదారులు దెబ్బతిన్నట్లుగా గుర్తించారు. ఆయా పనులను త్వరలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో చేపట్టనున్నారు.

విద్యార్థులకు క్రీడలు కూడా ముఖ్యమే



క్లస్టర్ స్థాయి పాఠశాలల వాలీబాల్ పోటీలో ఆడుతున్న క్రీడాకారులు

నర్సాపూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ నిత్యం కొంత సమయం కేటాయించాలని బీవీఆర్‌ఐటీ చైర్మన్ విష్ణురాజు పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ కాలేజీ మైదానంలో క్లస్టర్‌స్థాయి పాఠశాలల విద్యార్థుల వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ విష్ణురాజు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు మైదానంలో క్రీడలు మానేసి సెల్‌ఫోన్ ఆటలకు అలవాటు పడుతున్నారని, దీంతో అనేక ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పోటీల్లో 25 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు.

చౌటకూర్‌కు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం

పుల్‌కల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్‌లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) కార్యాలయం ప్రారంభమైంది. చౌటకూర్ మండలంగా ఏర్పాటయ్యాక ఒక్కొక్కటిగా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయి. ఇందులో భాగంగానే స్థానిక రైతు వేదిక భవనంలో గల ఓ గదిని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయానికి అప్పగించారు. ఈ మేరకు ఎంపీపీ మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి శనివారం ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు అధికారి బాలరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఇప్పటికే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం ఏర్పాటుతో దాదాపుగా అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంపీడీవో శంకర్, పీఆర్ డీఈఈ కృష్ణ, ఏఈ శశికుమార్, ఎంపీవో సువర్ణ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి అడ్డంగా ఉన్న గ్రిల్స్ తొలగింపు

పటాన్‌చెరు నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఇరువైపులా గ్రిల్స్ ఏర్పాటు చేయడం వల్ల కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోందని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధి శ్రీరాంనగర్ కాలనీకి అడ్డుగా ఉన్న ఇనుప గ్రిల్స్‌ను జేసీబీ సాయంతో తొలగించారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డుపైకి వచ్చేలా వీలు కల్పించేటట్టు కాలనీల రోడ్లకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

చేగుంట టీఆర్టీఎఫ్ మండల కమిటీ, తపస్ కాంప్లెక్స్ కమిటీ ఏకగ్రీవ ఎన్నికలు

చేగుంట, నవంబరు15(ఆంధ్రజ్యోతి): చేగుంట మండల టీఆర్టీఎఫ్, తపస్ కాంప్లెక్స్ కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. చేగుంట మండల టీఆర్టీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు జగన్‌లాల్, ప్రధానకార్యదర్శిగా దేవరాజ్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వెంకన్న, అబ్దుల్ రషీద్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తపస్ కాంప్లెక్స్ కమిటీ ఎన్నికల్లో చేగుంట కాంప్లెక్స్ కన్వీనర్‌గా కొండ చరణ్. రో కన్వీనర్‌గా కే. విజయలత, బోనాల కాంప్లెక్స్ లో శ్రీనివాస్, స్వరూపరాణి, మక్కరాజ్‌పేట్ కాంప్లెక్స్ లో సంగీత, ఎం. నరేష్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు మెంగర్తి ప్రణీద్, తపస్ బాధ్యులు రావుల వెంకటేష్, కృష్ణమూర్తి, బాలోళ్లి రేఖ, పట్లూరి యాదగిరి, సుమతి, మంజులత, సంధ్యారాణి, రాధా, ఉమాదేవి, శ్రీనివాస్, అమరేశ్వరి పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన

వెల్దుర్తి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి మూఢనమ్మకాలపై అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని హస్తాల్‌పూర్ ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఇంద్రజాల ప్రదర్శనను నిర్వహించి విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు.

క్రిష్ణాపూర్ పెద్ద చెరువులో చేప పిల్లల విడుదల

కల్హేర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని క్రిష్ణాపూర్ పెద్ద చెరువులో ఉచితంగా చేప పిల్లలను శనివారం మత్స్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు వదిలిపెట్టారు. ఈ చేప పిల్లల ద్వారా మత్స్యకారులకు ఉపాధి కలుగుతుందని కల్హేర్ ఎంపీడీవో మహేశ్వర్‌రావ్ అన్నారు. మత్స్య శాఖ ద్వారా క్రిష్ణాపూర్ మత్స్యకారుల ఉపాధి కోసం మంజూరైన ఉచిత చేపపిల్లలను గ్రామ శివారులోని పెద్ద చెరువులో వదిలినట్లు ఆయన తెలిపారు.